
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024



మరోసారీ

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ అమరావతికి మొండిచెయ్యే..



ఎన్నికల వత్సరంలోనూ పైసా కేటాయింపుల్లేవ్..

- రాష్ట్ర ప్రభుత్వ మూడు రాజధానుల స్వరం ఫలితమే..
- బెజవాడ మెట్రో రైలు ఊసెత్తని కేంద్రం
- అమరావతి రైల్వేట్రాక్ అటకెక్కినట్టే..
- రైల్వేకు అత్తెసరు కేటాయింపులు
- విజయవాడ-గూడూరుకు నాల్గో లైన్ మంజూరు
- విజయవాడ-విశాఖ మార్గంలో మూడు, నాలుగు లైన్లు
- కొత్త రైళ్ల మాట లేదు.. ప్రాజెక్టుల ఊసూ లేదు..

అంతన్నారు.. ఇంతన్నారు.. ఎన్నికల ముందు వరాల బడ్జెట్ అంటూ డప్పు కొట్టారు.. చివరికి ఎలక్షన్ ఇయర్‌లోనూ ఆంధ్రాకు చిల్లర కూడా విదల్చకుండా ఉత్త చెయ్యి చూపారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈసారి కూడా అమరావతికి మొండిచేయే చూపారు. విభజన హామీలపై ప్రస్తావన లేకపోవడం రాజధాని ప్రాంతవాసులను నిరాశకు గురిచేసింది. రాజధానివాసుల చిరకాల వాంఛ అయిన అమరావతి రైల్వేట్రాక్‌ను ఈసారీ అటకెక్కించారు. విజయవాడ, గుంటూరు మధ్య అమరావతిని అనుసంధానించేలా 106 కిలోమీటర్ల మేర నూతన రైల్వేలైన్ నిర్మాణానికి రూ.3,272 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలకు రైల్వేబోర్డు ఆమోదం తెలిపినా 2019 నుంచి ఏ బడ్జెట్‌లోనూ దాని ఊసెత్తలేదు. ఇక విజయవాడ మెట్రో రైలు కథ కూడా కంచికి చేరింది. విజయవాడ-గూడూరు నాల్గో లైన్‌ను మంజూరు చేయడం కాస్త ఊరట కలిగించే అంశం. విజయవాడ-విశాఖపట్నం మార్గంలో మూడు, నాల్గో లైన్లను కూడా కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని నిర్లక్ష్యం చేస్తూ మూడు రాజధానుల స్వరం అందుకోవడంతో అమరావతి రైలు, మెట్రో రైలు ప్రాజెక్టులపై కేంద్రం దృష్టిపెట్టడమే మానేసింది. వేతన జీవులకు పన్ను విధానాల్లో ఊరట కలిగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి/మచిలీపట్నం టౌన్

6

పేదలకు ఒరిగిందేమీ లేదు



పార్లమెంటులో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ప్రజా జీవనానికి ఏమాత్రం ఉపశమనం కలిగించేదిలా లేదు. పొంతన లేని గణాంకాలతో బడ్జెట్‌ను కూర్చారు. కార్పొరేట్ పన్నుల్లో ఏవిధమైన మార్పులు లేవు. దిగుమతి సుంకాలు కూడా పాత శ్లాబులకే పరిమితం చేశారు. బడ్జెట్‌లో బీమారంగ వృద్ధికి ఏ విధమైన పన్ను రాయితీ, ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పు లేకపోవడం శోచనీయం. రాయితీలను ఏమాత్రం పెంచలేదు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం నిర్మూలించడానికి ఏ విధమైన చర్యలు చేపట్టలేదు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగే విధంగా లేదు. ద్రవ్యోల్బణాన్ని నిలువరించలేదు.

- జి.కిషోర్‌కుమార్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి

ఉద్యోగ వర్గాలకు నిరాశ



ఉద్యోగులు ఎంతో ఎదురుచూసిన ఆదాయపు పన్ను మినహాయింపులు లేకపోవటం బాధాకరం. కరోనా తర్వాత జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. ఖర్చులు పెరిగాయి. ఈ క్రమంలో ఎన్నికల ముందు ప్రవేశపెడుతున్న మధ్యంతర బడ్జెట్‌లో ఉపశమనాలు ఉంటాయని మేమంతా భావించాం. తీరా చూస్తే ఆదాయపు పన్నులనే అంటుకోలేదు. చాలా ఆశ్చర్యంగా అనిపించింది. శ్లాబ్‌లు తగ్గించి ఉంటే బాగుండేది. ఉద్యోగులకు ఇది నిజంగా బాధాకరమైన విషయం.

- రాజబాబు, రవాణా నాన్ టెక్నికల్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు

ధరల నియంత్రణ చర్యలు శూన్యం



ధరల నియంత్రణ చర్యలు ఈ బడ్జెట్‌లో మచ్చుకు కూడా కనిపించలేదు. కరోనా తర్వాత రాకెట్ కంటే వేగంతో పదేళ్లలో పెరగాల్సిన ధరలు ఒక్క ఏడాదిలోనే పెరిగాయి. ఆ తర్వాత బడ్జెట్లలో అయినా ధరల నియంత్రణ చర్యలు చేపడతారనుకుంటే అదీ జరగలేదు. కనీసం ఎన్నికల ముందు అయినా తగ్గిస్తారేమోనని అనుకుంటే అలాంటి చర్యలు చేపట్టకపోవటం బాధాకరం.

- సీహెచ్ కోటేశ్వరమ్మ, గృహిణి

అసైన్డ్ మంత్రం



కోన గ్రామంలోని అసైన్డ్ భూమిలో చేపల చెరువు

ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు ఓట్లు రాబట్టుకునే ప్రయత్నాల్లో పడ్డారు. మొన్నటి వరకు రహదారుల పక్కన నివసించే వారికి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా ఇంటి పట్టాలు ఇచ్చారు. తాజాగా అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చే అంశాన్ని తెరపైకి తెచ్చి రైతులకు ఆశలు చూపుతున్నారు. ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకే అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరు అంశాన్ని తెరపైకి తెచ్చారనే విమర్శలు వస్తున్నాయి.

6

అసైన్డ్ భూమికి పట్టాలిస్తామంటూ అధికార పార్టీ హడావుడి

మచిలీపట్నంలో 11 గ్రామాల్లోని భూములపై కన్ను

- 9,729 ఎకరాలు ఇతరుల చేతుల్లో..
- హడావుడిగా సర్వేలు.. వీఆర్వోలపై ఒత్తిడి
- ఓట్లు రాబట్టుకునే వ్యూహంలో భాగమే..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం తీరప్రాంతంలో ఉన్న పోలాటితిప్ప, కొత్తపల్లెతుమ్మలపాలెం, తాళ్లపాలెం, కానూరు, పెదపట్నం, పల్లెతుమ్మలపాలెం, కోన, రుద్రవరం, గుండుపాలెం, చిన్నాపురం, వాడపాలెం గ్రామాల్లో వేలాది ఎకరాల అసైన్డ్, మడ అడవుల భూములున్నాయి. వీటిని గతంలో పేదలకు ఇవ్వగా, వారు విక్రయించేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, మచిలీపట్నం తదితర ప్రాంతాలకు చెందిన బడాబాబులు ఈ భూములను నిబంధనలకు వ్యతిరేకంగా కొనుగోలు చేసి చేపలు, రొయ్యల చెరువులుగా మార్చి సాగు చేస్తున్నారు. మత్స్యకారుల గ్రామాలకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను కుటుంబానికి రెండున్నర ఎకరాలు, అంతకుమించి ప్రభుత్వ భూములను స్థానికులు పంచుకుని కొంతకాలానికి విక్రయించేశారు. ఎలాంటి పత్రాలు, ఆధారాలు లేకున్నా బడాబాబులు ఈ భూములను కొని చేపలు, రొయ్యలు సాగు చేసున్నారు. ఒక్కో బడాబాబు వద్ద 200 నుంచి 1,500 ఎకరాలు కొనుగోలు చేసిన దాఖలాలు ఉన్నాయి. అసైన్డ్, ప్రభుత్వ భూములకు సంబంధించి ఎలాంటి క్రయవిక్రయాలు జరగకూడదనే నిబంధన ఉన్నా, వివిధ రూపాల్లో వేలాది ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూమి నలుగురైదుగురు రైతుల చేతులు మారినట్లుగా రికార్డులు సృష్టించారు. ఈ తరహా భూములను సర్వే చేసి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇచ్చే ప్రతిపాదనను ఇటీవల తెరపైకి తెచ్చారు.

వీఆర్వోలపై ఒత్తిడి

గత మే 22వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మచిలీపట్నం పోర్టు పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన సమయంలో అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని ప్రతిపాదన పెట్టారు. దీంతో మచిలీపట్నం మండలంలో అసైన్డ్ భూములను సర్వే చేసిన అధికారులు ఈ భూములకు పట్టాలు ఇస్తామని చెబుతున్నారు. మచిలీపట్నం మండలం తహసీల్దార్ ఈ తరహా పట్టాలు ఇవ్వాలని, ఇందుకు సంబంధించిన భూమి రికార్డులు తయారు చేయాలని ఇటీవల కాలంలో వీఆర్వోలపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. అసైన్డ్ భూముల వ్యవహారమంతా గజిబిజిగా ఉన్న నేపథ్యంలో ఎవరి పేరున పట్టాలు రాయాలనే అంశంపై వీఆర్వోలు గందరగోళానికి గురవుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నామని వీఆర్వోలు అంటున్నారు. భూమి పట్టాదారులు, లేదా వారి వారసులు, ప్రస్తుతం భూమిని సాగు చేసుకుంటున్న వారికి ఫారం-1, 2లను జారీ చేసే పనిలో ఉన్నారు. ఈ నోటీసులపై తహసీల్దార్ సంతకమే కాకుండా, వీఆర్వోలను కూడా సంతకాలు చేయాలని చెబుతుండటంతో భయం పట్టుకుంది. భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదురైతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అందిన ఈ నోటీసులో 15 రోజుల్లో సంజాయిషీ, అభ్యంతరాలను తెలియజేయాలని పేర్కొంటున్నారు. నిర్దీత గడువు ముగిసిన తరువాత అసైన్‌మెంట్ దారులకు పట్టాలు తహసీల్దార్ మంజూరు చేస్తారని ప్రచారం చేస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం స్థానిక శాసనసభ్యుడి కనుసన్నల్లోనే జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇతరుల చేతుల్లో ఉంటే స్వాధీనం చేసుకుంటాం : కలెక్టర్

మచిలీపట్నం మండలంలోని 11 గ్రామాల్లో అసైన్డ్ భూమిని పేదలకు పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సర్వే చేశామని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. గురువారం తన చాంబరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. మచిలీపట్నం మండలంలో అసైన్‌మెంట్ భూమికి పట్టాలు ఇచ్చే అంశంపై ఆయన మాట్లాడుతూ అర్హుల చేతిలో లేకుండా, వేరే వ్యక్తుల స్వాధీనంలో అసైన్డ్ భూమి ఉంటే స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పనిచేస్తున్నామని తెలిపారు. నోటీసులు అందుకున్న రైతులు 15 రోజుల వ్యవధిలోగా భూమికి సంబంధించిన పత్రాలు ఏమైనా ఉంటే తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయంలో చూపాలని ఆయన సూచించారు.

సర్వే వివరాలు

ఈ 11 గ్రామాల్లో భూములు గతంలో ఎవరి పేరున ఇచ్చారు. ప్రస్తుతం ఎవరు సాగు చేసుకుంటున్నారు, ఎంతమంది రైతుల చేతులు మారింది, సాగు చేసుకుంటున్న రైతుల వద్ద భూమికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా, లేవా..? తదితర అంశాలపై గత ఏడాదిలో సర్వే చేయించారు. అధికారుల సర్వేలో 12,311 ఎకరాల అసైన్డ్ భూమి మచిలీపట్నం మండలంలో ఉన్నట్లుగా గుర్తించారు. ఇందులో 2,183 ఎకరాల భూమి 1,570 మంది అసలు రైతులు, లేదా వారి వారసులే సాగు చేసుకుంటున్నారని, 9,729 ఎకరాల భూమి ఇతరుల స్వాధీనంలో ఉన్నట్లుగా గుర్తించారు. మరో 387 ఎకరాల భూమి అసైన్‌మెంట్ చేయడానికి అవకాశం లేదని తేల్చారు.

దళితులే దోషులా..!

గన్నవరం టీడీపీ నాయకుడు కాసరనేని రంగబాబుపై దాడి కేసులో తెరవెనుక పన్నాగాలు పన్నుతున్నారా? అసలు దొంగలను వదిలేసి ఓ దళితుడిని ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారా? తెరవెనుక జరుగుతున్న ఈ హైడ్రామాకు కథ, స్ర్కీన్‌ప్లే ఎమ్మెల్యే వంశీ, ఆయన అనుచరగణానిదేనా? డైరెక్షన్ మాత్రం పోలీసులు చేస్తున్నారా? అంటే అవుననే సమాధానమే వస్తుంది.

గన్నవరం టీడీపీ నేతపై దాడి కేసులో హైడ్రామా

- కథ, స్ర్కీన్‌ప్లే ఎమ్మెల్యేది.. డైరెక్షన్ పోలీసులది..
- అసలు సూత్రధారిని తప్పించి దళితుడిని ఇరికించే యత్నం
- ఎమ్మెల్యే తీరుపై దళితుల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహం



నిందితులను గన్నవరం కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

విజయవాడ-ఆంధ్రజ్యోతి/గన్నవరం : గన్నవరానికి చెందిన టీడీపీ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై జనవరి 21న కొందరు వ్యక్తులు దాడి చేశారు. రంగబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని 'పొలం కొనుగోలు చేస్తాం.. చూపించండి' అంటూ ఎలైట్ హోటల్ వద్దకు కొందరు పిలిపించారు. ఆయనపై కర్రలతో దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. ఈ ఘటనలో ఆయన కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. తనకు కంట్లో నలుసుగా ఉన్న టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని వంశీ, ఆయన అనుచరులే ఈ దాడి చేయించారన్నది అందరికీ తెలిసిన సత్యం. కానీ, తన రాజకీయం కోసం దళితుడిని పావుగా వాడుకున్నారు. రంగబాబుపై దాడి చేసింది చిరంజీవేనంటూ అతన్ని కేసులో ఇరికించి ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చేతులు దులిపేసుకున్నారు. పోలీసులు సైతం ఎమ్మెల్యే చెప్పినట్టుగా విచారణ సాగించి మమ.. అనిపించారు. చిరంజీవితో పాటు హైదరాబాద్‌కు చెందిన నరేశ్ మరో ముగ్గురిని నిందితులుగా చూపారు.

ఎవరు ఈ చిరంజీవి..?

రంగబాబుపై దాడి కేసులో నిందితుడిగా చూపిన ముగ్గిరాల చిరంజీవిది మధ్యతరగతి దళిత కుటుంబం. గన్నవరం నియోజకవర్గంలోని ఆత్కూరు ఆయన గ్రామం. ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితుడైన రంగా వెనుక తిరిగే వ్యక్తుల్లో చిరంజీవి ఒకరు. రంగబాబుపై దాడి చేయించే స్థాయి ఇతనికి లేదు. వాస్తవానికి ఈ దాడిలో ఉపయోగించిన ఇన్నోవా కారు దాడికి ఒకరోజు ముందు అంటే.. జనవరి 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి బయల్దేరి సాయంత్రం 7 గంటల ప్రాంతంలో విజయవాడ వెటర్నరీ కాలనీకి చేరుకుంది. మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటిగంట వరకు అదే ప్రాంతంలో ఉన్న కారు మధ్యాహ్నం 2.30 సమయంలో రంగబాబుపై దాడి జరిగిన ప్రాంతంలో ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అదేరోజు రాత్రి కారును విద్యాధరపురంలోని కుమ్మరిపాలెం వద్ద వదిలి నిందితులు వెళ్లిపోయారు. 22వ తేదీ ఉదయం 11 గంటలకు కారును గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం కారు కంకిపాడు పోలీసుస్టేషన్ వద్ద ఉంది. అయితే, నిందితులు హైదరాబాద్ నుంచి వచ్చాక వెటర్నరీ కాలనీలోని ఓ ఇంటి వద్ద సుమారు 18 గంటలపాటు ఉన్నారు. ఈ ఇల్లు ఎవరిది? నిందితులకు ఆ ఇంట్లో ఉన్నవారికి సంబంధం ఏమిటనే కోణంలో పోలీసులు విచారణ జరపకుండా చిరంజీవిని ఇరికించడంపై దృష్టి సారించారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. రంగబాబుపై దాడి వెనుక కచ్చితంగా పెద్దస్థాయి వ్యక్తులే ఉన్నారని వారిని తప్పించేందుకు పోలీసులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారన్నది స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యే, ఆయన అనుచరుల కోసం దళితులను పావులుగా వాడుకోవడం ఏమిటని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంగబాబుపై హత్యాయత్నం కేసు అని అలాంటి కేసులో దళితులను ఇరికించడం ఏమిటని దళిత సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

నిందితులకు 14 రోజుల రిమాండ్

రంగబాబుపై జరిగిన దాడి ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచారు. స్థానిక అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శిరీషా నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించగా, గన్నవరం సబ్‌జైలుకు తరలించారు. ఆరుగురు వ్యక్తులు కారులో వచ్చి రంగబాబుపై దాడి చేయగా, వారిలో ఐదుగురు మాత్రమే దొరికారని, మరొకరు పరారీలో ఉన్నారని

- మిగతా 6లో

పదిమంది డీఎస్పీల బదిలీ

- విజయవాడ పశ్చిమ ఏసీపీగా మురళీకృష్ణారెడ్డి
- ట్రాఫిక్ ఏసీపీగా అశోక్‌కుమార్ గౌడ్
- మచిలీపట్నం డీఎస్పీగా రాంబాబు

విజయవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి పదిమంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. అమలాపురం దిశ డీఎస్పీగా ఉన్న ఎస్.మురళీమోహన్‌ను మైలవరం ఏసీపీగా బదిలీ చేశారు. కాకినాడ డీఎస్పీగా ఉన్న పడాల మురళీకృష్ణారెడ్డిని విజయవాడ పశ్చిమ ఏసీపీగా నియమించారు. నూజివీడు డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్ గౌడ్‌ను విజయవాడ-2 ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ చేశారు. పోలవరం డీఎస్పీ జి.రత్నరాజును విజయవాడ సౌత్ ఏసీపీగా నియమించారు. కృష్ణాజిల్లా సీసీఎస్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణకు విశాఖపట్నం నార్త్ ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. విజయవాడ పశ్చిమ ఏసీపీగా ఉన్న డాక్టర్ కె.హనుమంతరావును కాకినాడకు బదిలీ చేశారు. విజయవాడ నార్త్ ఏసీపీగా ఉన్న సీహెచ్ రవికాంత్‌ను గుంటూరు నార్త్ డీఎస్పీగా నియమించారు. దిశ ఏసీపీ వీవీ నాయుడును గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా పంపారు. విజయవాడ టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న బీవీ సుబ్బరాజును గుంటూరు దిశ డీఎస్పీగా బదిలీ చేశారు. మైలవరం ఏసీపీగా ఉన్న మార్గాని రమేశ్‌ను గుంటూరు సీసీఎస్ డీఎస్పీగా నియమించారు. గుంటూరు నార్త్ డీఎస్పీ జవంగుల రాంబాబుకు మచిలీపట్నం డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. గుంటూరు సీసీఎస్ డీఎస్పీ కూరపాటి ప్రకాశ్‌బాబును విజయవాడ దిశ డీఎస్పీగా నియమించారు. సైబర్ క్రైం ఏసీపీ సీహెచ్ శ్రీనివాస రావును ప్రకాశం జిల్లా దిశ డీఎస్పీగా బదిలీ చేశారు. విజయవాడ ట్రాఫిక్-2 ఏసీపీ జె.వెంకట నారాయణను పశ్చిమగోదావరి జిల్లా ఎస్ఈబీకి పంపారు.

సిద్ధంగా లేనట్టే..!

వైసీపీ 'సిద్ధం' సభకు ఎమ్మెల్యే వసంత హ్యాండ్

- దెందులూరు సభ నిమిత్తం జనసమీకరణకు ససేమిరా
- మైలవరం జనసమీకరణ బాధ్యతలు కేశినేని నానికి..
- త్వరలో వైసీపీకి గుడ్‌బై చెప్పనున్న వసంత
- మైలవరం వైసీపీ అభ్యర్థి కోసం వెతుకులాట
- జోగి రమేశ్‌ను పంపే యోచన



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ అట్టహాసంగా నిర్వహిస్తున్న 'సిద్ధం' రెండో సభకే ఎన్టీఆర్ జిల్లా నుంచి ఎదురుదెబ్బ తగిలింది. సిద్ధం సభను ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సమీపంలో ఈనెల 3వ తేదీన నిర్వహిస్తున్నారు. ఈ సభకు ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి కూడా భారీ ఎత్తున జనసమీకరణ చేయాలని వైసీపీ నాయకులు నిర్ణయించారు. ఈ బాధ్యతను ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు అప్పగించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అందరు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు జనసమీకరణలో నిమగ్నమవ్వగా, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాత్రం ఈ హడావుడి తనకు పట్టనట్టు ఉండిపోయారు. వసంత తీరుపై కంగుతిన్న వైసీపీ పెద్దలు బుధవారం ఆయన్ను సంప్రదించగా, తాను సిద్ధం సభకు హాజరుకావడం లేదని, జనసమీకరణ కూడా తాను చేయబోవడం లేదని తేల్చిచెప్పారు. దీంతో అప్పటికప్పుడు మైలవరం నుంచి జనసమీకరణ చేసే బాధ్యతను ఇటీవలే వైసీపీ కండువా కప్పుకొన్న విజయవాడ ఎంపీ కేశినేని నానికి అప్పగించారు.

త్వరలో వైసీపీకి గుడ్‌బై

వసంత కృష్ణప్రసాద్ త్వరలోనే వైసీపీని వీడనున్నారని విశ్వసనీయ సమాచారం. ఆయన టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. వసంత సైతం వైసీపీ తీరుపై వివిధ వేదికలపై తన అసంతృప్తిని వెళ్లగక్కుతూ వచ్చారు. తాజా పరిణామాల నేపథ్యంలో వసంత వైసీపీని వీడటం ఖాయమైనట్లేనని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. వసంతకు ఏ స్థానాన్ని కేటాయించాలన్న అంశంపై టీడీపీ పెద్దలు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. దానికోసమే ఆయన వేచిచూస్తున్నారని సమాచారం. వసంత వైసీపీని వీడే పక్షంలో మైలవరంలో వైసీపీ కొత్త అభ్యర్థి కోసం వెతుకులాట మొదలు పెట్టాల్సిన పరిస్థితి. ఈ స్థానం నుంచి పోటీ చేయడానికి మంత్రి జోగి రమేశ్ ఉవ్విళ్లూరారు. అధిష్ఠానం ఆయన్ను పెనమలూరు ఇన్‌చార్జిగా నియమించింది. అయితే, గత్యంతరం లేని పరిస్థితుల్లో మైలవరం నుంచి జోగి రమేశ్‌ను బరిలో దింపేందుకు వైసీపీ పెద్దలు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



ర్యాలీలో పాల్గొన్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల ప్రతినిధులు

ప్రభుత్వ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

» ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ర్యాలీ

పెనమలూరు, ఫిబ్రవరి1 : డిగ్రీ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి తీసుకోవాలంటూ వచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజిమెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కామయ్య తోపు నుంచి వీఆర్ సిద్ధార్థ కళాశాల వరకు జరిగిన ర్యాలీలో 15యూనివర్సిటీలకు సంబంధించిన ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. డిగ్రీ కోర్సులు బీబీఏ, బీసీఏ, బీఎంఎస్ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతి తప్పనిసరంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలల కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి తీసుకెళ్లే పక్షంలో పేద విద్యార్థికి చదువు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఏఐసీటీఈ నోటిఫికేషన్ రద్దు చేసి ఏపీలో ఉన్న డిగ్రీ కళాశాలల మనుగడను కాపాడుకోవడానికి ప్రతి డిగ్రీ కళాశాల యాజమాన్యం పూనుకోవాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో అసోసియేషన్ ప్రెసిడెంటు కనుమర్ల గుండారెడ్డి, కార్యదర్శి జెర్రిపోతుల రమణాజీ, ఆర్థిక కార్యదర్శి గుర్రాల వెంకటరెడ్డి, గౌరవాధ్యక్షులు చింతల విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మచిలీపట్నంలో రిలే దీక్షా శిబిరంలో యూటీఎఫ్ నేతలు

టీచర్లు, ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

» యూటీఎఫ్ రిలే దీక్షలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 : టీచర్లు, ఉద్యోగులకు అందాల్సిన బకాయిలు చెల్లించాలంటూ యూటీఎఫ్ నాయకులు గురువారం మచిలీపట్నం ధర్నాచౌక్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు సందర్శించి ప్రసంగించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్న రూ. 1896 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతినెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలన్నారు. రూ.4500 కోట్లు సరెండర్ లీవు ఎన్‌క్యాష్‌మెంట్, రుణాల బకాయిలు, పీఎఫ్ చెల్లింపులు సుమారు రూ.1000 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు జె.లెనిన్‌బాబు మాట్లాడుతూ, సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వం దిగిరాక పోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. దీక్షా శిబిరంలో యూటీఎఫ్ నేతలు నాగేశ్వరరావు, ఝాన్సీ, సీహెచ్ శ్రీధర్, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ రంగులోత్సవం



పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 1 : తిరుపతమ్మ అమ్మవారి రంగులోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. వైదిక కమిటీ నిర్వహించిన శుభముహర్తం మేరకు గురువారం తిరుపతమ్మ-గోపయ్య, సహదేవతల విగ్రహాలను ఆలయం నుంచి బయటకు తీసుకువచ్చారు. తొలుత చైర్మన్ జంగాల శ్రీనివాసరావు (వాసు), ధర్మకర్తలు, ఆలయ ఈవో కె.రమేష్ నాయుడులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం గ్రామానికి చెందిన రజకులు 11 విగ్రహాలను నెత్తిన పెట్టుకొని మేళతాళాలతో భారీ ఊరేగింపుగా పడమర బజారున ఉన్న అమ్మవారి రంగుల మండపం వద్దకు చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం లాటరీ ద్వారా ఎంపిక చేసిన 11 ఎద్దుల బండ్లలో విగ్రహాలతో గురువారం రాత్రి జగ్గయ్యపేటకు బయలుదేరి వెళ్లారు. జగ్గయ్యపేట సీఐ ఎం.జానకిరామ్ పర్యవేక్షణలో ఎస్సై సీహెచ్ కనకదుర్గా ప్రసాద్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. తహసీల్దార్ కె.లక్ష్మి కల్యాణి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మాజీ చైర్మన్స్ వాసిరెడ్డి బెనర్జీ, నూతలపాటి చెన్నకేశవరావు, కర్ల వెంకట నారాయణ, లగడపాటి వెంకటేశ్వరరావు, గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నిమ్మకాయల రాజప్ప, సౌమ్య

మండవ వరలక్ష్మికి నేతల నివాళి

నందిగామ రూరల్ : నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వర్గీయ మండవ వరలక్ష్మి సంస్కరణ సభ గురువారం ఆమె ఇంటి వద్ద జరిగింది. కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి పార్టీలకతీతంగా రాజకీయనాయకులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. టీడీపీ నేతలు చినరాజప్ప, నెట్టెం రఘురాం, దేవినేని ఉమామహేశ్వరరావు, కేశినేని శివనాథ్, తంగిరాల సౌమ్య, వైసీపీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, జనసేన పార్టీ సమన్వయకర్త రమాదేవిలు వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులు పిచ్చయ్య, భవానిశంకర్, శ్రీనివాసరావు, కృష్ణకుమారిలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


రాత్రి సమయంలోనూ మిల్లు వద్దే వేచి ఉన్న రైతులు

ధాన్యం విక్రయాల్లో అవస్థలు!

» ఆన్‌లైన్ చేసినా తీసుకునేందుకు నిరాకరిస్తున్న మిల్లర్

» రెండ్రోజులుగా మిల్లు వద్దే ట్రాక్టర్లతో రైతుల పడిగాపులు

మోపిదేవి, ఫిబ్రవరి 1 : ధాన్యం విక్రయించేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. ఆన్‌లైన్‌లో నమోదు చేసినా ధాన్యం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రింబవళ్లు మిల్లువద్ద ధాన్యంతో పడిగాపులు పడుతున్నారు. మండలంలోని కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన కౌలురైతు మత్తి వెంకట రామారావు తాను సాగు చేసిన రెండు ఎకరాలు నూర్పిడి చేసి ధాన్యం విక్రయించేందుకు పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్ చేశాడు. ట్రాక్టర్‌పై ధాన్యాన్ని తీసుకుని బుధవారం పెదకళ్లేపల్లిలోని మిల్లుకు తీసుకువెళ్లి ఆన్‌లైన్‌లో వచ్చిన ట్రక్ షీట్‌ను మిల్లరుకు చూపగా.. ధాన్యం రంగు మారింది.. నిబంధనల మేరకు తీసుకోవటం జరగదని మిల్లరు నిరాకరించినట్టు రైతు వాపోయాడు. ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రెండ్రోజులుగా తిరుగుతున్నా మిల్లర్లు నిరాకరిస్తున్నారని, విషయం గ్రామ, మండల స్థాయి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేది లేక మిల్లు చెంతనే ధాన్యం ట్రాక్టర్‌పై ఉంచి కాపలా కాయాల్సి వస్తున్నదని రైతు చెబుతున్నారు. రెండు రోజులైనా కనీసం సమాధానం చెప్పే వారు కానరావటం లేదని ఆందోళన చెందుతున్నారు. రైతులకు వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు రంగారావులు బాసటగా నిలిచి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

అసంతృప్త మధ్యంతర బడ్జెట్

మధ్యంతర బడ్జెట్‌పై ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య రంగాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఎన్నికల 'మధ్యంతర' బడ్జెట్ కావటంతో.. ఎంతో కొత్త రాయితీలు ఉంటాయని భావించాయి. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విజయవాడ వచ్చినపుడు కూడా వ్యాపార వర్గాల నుంచి పలు ప్రతిపాదనలు అందించటం జరిగింది. ఇవేవీ మధ్యంతర బడ్జెట్‌ను పెద్దగా ప్రభావితం చేయకపోవటంతో ఆయా వర్గాలు అసంతృప్తితో ఉన్నాయి.

» ఉద్యోగ, వ్యాపార వర్గాల పెదవి విరుపు

» ఆదాయ పన్ను ఉపశమనాలు లేవు

» ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో పారిశ్రామిక వర్గాల నిరాశ

» రైల్వేకు అత్తెసరు కేటాయింపులు.. కొత్త రైళ్లు.. ప్రాజెక్టులూ లేవు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు ప్రధానంగా ప్రత్యక్ష, పరోక్ష పన్ను విధానాలలో మార్పులు, రాయితీలు ప్రకటిస్తారని ఆశించాయి. బడ్జెట్ కోసం ఉత్కంఠగా చూశాయి. మధ్యంతర బడ్జెట్‌లో అలాంటివేమీ లేకపోవటంతో తీవ్ర నిరాశ చెందాయి. ఆదాయపు పన్నులో పరిమితులకు సంబంధించి ఎలాంటి ఉపశమనాలు లేకపోవటంతో ఉద్యోగులు నిరుత్సాహం చెందారు. కరోనా తదనంతర పరిస్థితుల్లో ప్రజల జీవన వ్యయం పెరిగి ఆదాయానికి మించి ఖర్చులు నెలకొన్నాయి. ఆదాయపు పన్ను మినహాయింపుల మీద కనీసం దృష్టి సారించకపోవటంతో వారు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. కొవిడ్ తర్వాత కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ధరలు నియంత్రించేందుకు ఈ బడ్జెట్‌లో కేంద్రం దృష్టి సారిస్తుందనుకుంటే అది జరగలేదు. నిత్యావసరాలపైనా జీఎస్టీలు వేస్తోంది. ఉత్పాదక వర్గాలు నిత్యావసరాలపై జీఎస్టీని తగ్గించాలని కోరినా.. ఈ బడ్జెట్‌లో అలాంటిదేమీ లేకపోవటంతో నిరాశ చెందాయి.

బెజవాడ రైల్వేకు కేటాయింపులు..

విజయవాడ-గూడూరు నాలుగో లైన్‌ను మంజూరు చేసింది. ఈ మార్గంలో ఇప్పటికే మూడోలైన్ పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ క్రమంలో నాలుగో లైన్‌ను మంజూరు చేసింది. విజయవాడ-విశాఖపట్నం మార్గంలో మూడు, నాలుగో లైన్లను కూడా కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. విజయవాడ-విశాఖపట్నం మధ్య రద్దీ తీవ్రంగా ఉంటుంది. ఈ అదనపు లైన్లు కూడా అందుబాటులోకి వస్తే పశ్చిమబెంగాల్ నుంచి దేశంలో దక్షిణ భాగానికి సరుకు రవాణాతో పాటు, ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించటం సాధ్యమౌతుంది. రూ.150 కోట్ల వ్యయంతో 15 గూడ్స్ షెడ్లలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు



కేటాయింపులు చేయటం జరిగింది. ఇంతకు మించి మధ్యంతర బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు విజయవాడ డివిజన్‌కు జరగలేదు. పాత ప్రతిపాదనల, కొత్త రైళ్ల ఊసు లేదు. విజయవాడ స్టేషన్ రీ డెవలప్‌మెంట్, కోచింగ్ డిపోల గురించి ప్రస్తావనే లేకుండా పోయింది.

ద్రవ్యలోటు తగ్గించలేదు

లక్ష్మీప్రసాద్, అధ్యక్షుడు సీఐఐ, ఏపీ చాప్టర్

ద్రవ్యలోటు 5.1 శాతానికి తగ్గిస్తామని బడ్జెట్‌లో చెప్పినా ఎలా తగ్గిస్తామన్నది స్పష్టం చేయలేదు. నానో డీఏపీ ప్రకటన మంచి పరిణామమే.. తద్వారా రవాణా ఖర్చులు తగ్గి వ్యవసాయానికి మేలు జరుగుతుంది. నూనె గింజల దిగుమతిపై ఆధారపడుతున్న దేశంగా భారత్ పరిశోధనపై దృష్టి సారించాలి. ఆయిల్ పామ్‌కు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి వుంది. దిగుమతి డ్యూటీ తగ్గించడం వల్ల రేటు పడిపోయింది. ప్రపంచంలోనే పెద్దదైన మంచినీటిలో సాగు ఆక్వా పరిశ్రమ ఏపీకి వుంది. కేంద్రం ప్రకటించిన ఐదు ఆక్వా పార్కుల్లో ఏపీకి ఒకటి ఇవ్వాలని కోరుతున్నాం. జై అనుసంధాన్ అని ప్రకటన చేసిన కేంద్రం కనెక్టివిటీ మౌలిక సదుపాయాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. ప్రాంతాల వారీగా పరిశ్రమలకు కావాల్సిన అంశాలపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతాం.

నైపుణ్యాలు పెరగాలి

- డి.రామకృష్ణ, సీఐఐ ప్రతినిధి

స్కిల్ ఇండియాపై భారీగా వ్యయం చేస్తున్న కేంద్రం యువత నైపుణ్యాలు, విద్యా సంస్కరణలపై దృష్టి సారించాల్సి వుంది. విశ్వవిద్యాలయాలు బోధిస్తున్న పాఠ్యాంశాలకు, పరిశ్రమ అవసరాలకు భారీ వ్యత్యాసం వుంది. ప్రస్తుత నైపుణ్యాలు సమీప భవిష్యత్ అవసరాలకు ఏమాత్రం సరిపోని పరిస్థితులు వున్నాయి. పరిశ్రమలకు అనుగుణంగా సామర్థ్యాలు పెరగాల్సి వుంది. సామర్థ్యాలు వెంటనే పెరగకపోతే భారత్ తీవ్రంగా ఇబ్బంది పడే అవకాశం వుంది. భారతీయ మానవవనరుల్లో సామర్థ్యాల పెంపు, జీవన నైపుణ్యాలు పెరగాల్సి వుంది.

స్వాగతించిన ఏపీ హోటల్స్ అసోసియేషన్

పర్యాటక రంగం దృష్టిలో పెట్టుకొని మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొన్ని చర్యలు ఆ రంగం అభివృద్ధికి బాటలు వేస్తాయని ఆశిస్తున్నామని ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐకానిక్ టూరిస్ట్ కేంద్రాల సమగ్ర అభివృద్ధి, ప్రపంచస్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ చేసే రాష్ట్రాలను ప్రోత్సహిస్తామని ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం ఆహ్వానించదగ్గదన్నారు. మ్యాచింగ్ ప్రాతిపదికన అటువంటి అభివృద్ధికి ఆర్థిక సహాయం చేయడానికి రాష్ట్రాలకు దీర్ఘకాలిక వడ్డీలేని రుణాలు అందచేస్తామని ఆర్థిక మంత్రి భరోసా ఇచ్చినందుకు రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. చిన్న, పెద్ద హోటళ్ల అభివృద్ధి, ప్రయోజనాలు కూడా పరిగణలోకి తీసుకొని తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కేంద్రం ఇచ్చిన ఈ భరోసాకి రాష్ట్ర ప్రభుత్వం కూడా తోడైతే పర్యాటక, అతిథ్య రంగం అభివృద్ధి సాధించడమే కాకుండా, ఉపాధి, ఉద్యోగావకాశాలు ఇంకా పెరుగుతాయని, ఇది అందరికీ మేలు చేస్తుందని భావిస్తున్నట్టు తెలిపారు. దీనితో పాటు హోటల్ రంగానికి చిరకాలంగా ఉన్న సమస్యల పరిష్కారంపై కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చిన్న హోటళ్ల నుంచి వసూలు చేసే 12 శాతం జీఎస్టీని 7 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రికి విన్నవించామని, అది అమలు చేసే దిశగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే కొవిడ్ తర్వాత హోటల్ రంగం ఇంకా కుదుటపడలేదని, అప్పట్లో ఇచ్చిన వడ్డీ రాయితీ కేవలం మూడేళ్ల వరకే ప్రకటించారని, దీనిని ఆరేళ్లకు పెంచితే హోటల్ రంగం నిలదొక్కుకుంటుందని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో హోటల్ మేనేజ్‌మెంట్, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.


బడ్జెట్ పరిశ్రమలకు నిరాశాజనకం

» ఏపీ ఎంఎస్ఎంఈఐఏ ప్రతినిధులు

ఆటోనగర్(పెనమలూరు) : కేంద్ర మధ్యంతర బడ్జెట్ పరిశ్రమలకు ఏమాత్రం ఊతమిచ్చేదిగా లేదని ఆటోనగర్ పారిశ్రామిక వేత్తలు అభిప్రాయపడ్డారు. గురువారం వారు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అసోసియేషన్ కేంద్రంలో సమావేశమై మధ్యంతర బడ్జెట్‌లోని అంశాలు, పరిశ్రమలకు ఒనగూరే ప్రయోజనాలపై చర్చించారు. పరిశ్రమల మనుగడకు ఈ బడ్జెట్ ఏ మాత్రం ఉపయోగపడదన్నారు. బడ్జెట్‌లోని అంశాలు నిరాశాజనకంగా ఉన్నాయని పేర్కొన్నారు. కొవిడ్‌లో తీవ్ర నష్టాలను చవిచూసిన పరిశ్రమలను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం కొత్త బడ్జెట్‌లో పరిశ్రమల పునరుత్తేజానికి మరిన్ని ప్రోత్సాహ



కాలు ఉండేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మలినేని నారాయణ ప్రసాద్, అన్నే శివనాగేశ్వరరావు, టి.పార్థసారధి, పొన్నం శ్రీరాం, రమేశ్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, అన్నే నరసింహరావు, టీవీ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బంటుమిల్లి ప్రధాన కాలువ నీటి మట్టం పరిశీలిస్తున్న కాగిత

సాగు, తాగు నీటికి కటకట!

» ఆరుతడి పంటలకు అందని సాగునీరు!

» తాగునీరూ ఇవ్వలేని ప్రభుత్వం : కాగిత

బంటుమిల్లి : కనీసం ప్రజలకు తాగునీటిని కూడా అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని పెడన ఇన్‌చార్జ్ కాగిత అన్నారు. గురువారం మండల పార్టీ కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో పెడన ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు, రైతులు బంటుమిల్లి ప్రధానకాల్వను పరిశీలించారు. అనంతరం జలవనరుల శాఖ డీఈ బి.బి.ఎస్ గణపతికి అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరుతడి పంటలకు నీరివ్వలేని వారు రైతులకు సబ్సిడీపై అపరాలు ఎందుకిచ్చారని ప్రశ్నించారు. మూడు పంటలకు నీరు ఇస్తామని ప్రగాల్భాలు పలికిన వైసీపీ నేతలు ఆరుతడి పంటలకే కాదు కనీసం తాగునీటిని కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. బంటుమిల్లి ప్రధాన కాలవ నీటిమట్టం సుమారు రెండు అడుగులు మాత్రమే ఉండగా.. కనీసం ఐదు అడుగులు నిలకడగా ఉంటేనే మంచినీటి చెరువులు నింపవచ్చన్నారు. డీఈ గణపతిని వివరణ కోరగా.. బంటుమిల్లి ప్రధాన కాలవకు ఈనెల 29న గుడ్లవల్లేరు నుంచి వంద క్యూసెక్కుల నీరు వదిలారని తెలిపారు. నాలుగు వందల క్యూసెక్కులకు పైగా వదిలితేనే బంటుమిల్లి ప్రధాన కాలవపై ఉన్న పంచాయతీ చెరువులు నింపుకోవచ్చని తెలిపారు. జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు లేకపోవడమే సమస్యలకు కారణమని తెలిపారు. కార్యక్రమంలో జేఈ రాజ్యలక్ష్మి, బొర్రా కాశీ,యిల్లారి లీలాకృష్ణ, చెన్ను శ్రీనివాసరావు, రేవు గోపాలకృష్ణ, కంఠమనేని మురళీ, యార్లగడ్డ శ్రీనివాసరావు, తాతా రాజా, కొండా, బొల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడికి ఇంజన్లే దిక్కు..


సాగునీటి కోసం మోటార్ల ఏర్పాటు

అవనిగడ్డ రూరల్ : ఆరుతడి పంటలకు సాగునీరు అందకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలాశయాలు అడుగంటడంతో పంట తడిపేందుకు నీటికోసం దివిసీమ రైతులు నానా ఆగచాట్లు పడుతున్నారు. చెరువులు, కుంటలు నింపుకోవటానికి సాగునీరు విడుదల చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తమ పంట పొలాలకు నీరు మళ్లించుకుంటున్నారు. దివిసీమలోని మోదుమూడి వంతెన వద్ద సుమారు ఏడు మోటార్లతో నీటిని తోడే కార్యక్రమం చేపట్టారు. రాత్రి, పగలు ఆరుతడి పంటలు కాపాడుకోవటానికి రైతులు శ్రమిస్తున్నారు. మినుము రైతుకు నీటి ఎద్దడి తలెత్తటంతో దివిసీమలోని పలు ప్రాంతాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆరుతడి పంటలు తడుపుకోవటానికి సాగునీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గొర్రెల్లా తరలించి.. తలుపులు మూసేసి..

» నరకం చూపిన ఆసరా సంబరం

» ఆద్యంతం ప్రతిపక్షాలపైనే విమర్శలు

» అసహనంతో మధ్యలోనే వెళ్లిపోయిన డ్వాక్రా సంఘాల మహిళలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 1 : నాల్గవ విడత ఆసరా సంబరాల కార్యక్రమం డ్వాక్రా మహిళలకు నరకాన్ని చూపింది. మండలంలో సుమారు 7600 మందికి పైగా ఉన్న డ్వాక్రా మహిళలను ఎట్టి పరిస్థితుల్లో కనీసం ఐదువేలకు తగ్గకుండా ఆసరా సంబరాల కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని ప్రజాప్రతినిధులు, నేతలు వెలుగు సిబ్బందికి హుకుం జారీ చేయడంతో బుక్ కీపర్లు, వీవోఏలు పెద్ద సంఖ్యలో మహిళలను సమీకరించారు. అయితే గురువారం టీటీడీ కళ్యాణమండపంలో నిర్వహించిన ఆసరా సభలో తగిన ఏర్పాట్లు చేయకపోవటంతో మహిళలు నరకాన్ని చవిచూశారు. కనీసం కుర్చీలు,


ఆసరా సభ మధ్యలోనే వెళ్లిపోతున్న డ్వాక్రా మహిళలు

తాగునీరు అందుబాటులో లేకుండా గొర్రెల మందను తోలినట్టు తమను కళ్యాణ మండపంలో కుక్కి అధికారులు వేడుక చూడటం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం జరుగుతుండగానే వెనుతిరిగి వెళ్లేందుకు ప్రయత్నించగా వైసీపీ నేతలు మహిళలను బయటకు వెళ్లకుండా గేట్లు మూసేయటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ తలుపులు తోసుకుని మరీ గుంపులుగా బయటికి వెళ్లిపోయారు. నాల్గవ విడత ఆసరాలో భాగంగా మండలంలో లబ్ధిదారులకు రూ.9.35 కోట్ల చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. పార్టీ నేతలంతా ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ కార్యక్రమాన్ని రాజకీయ సభగా మార్చివేయటంతో ఇందుకోసమేనా? బలవంతంగా తరలించారని మహిళలు అసహనం వ్యక్తం చేశారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, ఫిబ్రవరి 1 : ఉమ్మడి జిల్లాలోని 13 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి, ఇంటర్మీడియట్, ఐఐటీ/నీట్ శిక్షణతో కూడిన ప్రవేశాలకు ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త బి.సుమిత్రాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 2080 సీట్లు (5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1040, జూనియర్ ఇంటర్ ఎంపీసీ-440, బైపీసీ-440, ఎంఈసీ-80, సీఈసీ-80) వున్నట్టు చెప్పారు. హెచ్‌టీటీపీ://ఏపీబీఆర్ఏజీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్, హెచ్‌టీటీపీ://ఏపీబీఆర్ఏజీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/ఇంటర్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, దరఖాస్తు సమయంలోనే గురుకులాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌లో అదనంగా నీట్, ఐఐటీ శిక్షణ కావాలనుకొనే వారు ఆప్షన్ ఇచ్చుకోవాలన్నారు. వీరికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తారని, ఉత్తమ ప్రతిభ చూపితే రాష్ట్రస్థాయికి ఎంపికై కర్నూలు, గుంటూరు, విజయవాడ కేంద్రాల్లో చేరవచ్చన్నారు. మార్చి 10న ప్రవేశపరీక్ష వుంటుందని, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు 10వ తరగతి సిలబస్, 5వ తరగతిలో ప్రవేశాలకు 4వ తరగతి సిలబస్‌లో పరీక్ష వుంటుందని తెలిపారు. గురుకులాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిని సద్వినియోగం చేసుకోవచ్చని సుమిత్రాదేవి సూచించారు.

అర్హతలు : 5వ తరగతి ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ వారు 1-9-2011 నుంచి 31-8-2015 మధ్య, ఓసీ, బీసీ విద్యార్థులు 1-9-2013 నుంచి 31-8-2015 మధ్య జన్మించి వుండాలి.

- ఇంటర్ కోసం 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు హాజరుకావాలి.
- 3, 4 తరగతులు సొంతజిల్లాలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి, వార్షికాదాయం రూ.1 లక్ష దాటకూడదు.
- ఎస్సీలకు 75శాతం, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్-12, ఎస్టీ-6, బీసీ-5, ఇతరులకు రెండు శాతం రిజర్వేషన్. వీరిలో దివ్యాంగులకు 3 శాతం, ప్రత్యేక విభాగాలకు చెందిన వారు, సైనిక ఉద్యోగుల పిల్లలకు 15 శాతం సీట్లు కేటాయిస్తారు.

ఎంపీడీవోల బదిలీలు

ఆంధ్రజ్యోతి- విజయవాడ/భవానీపురం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఎంపీడీవోలను గురువారం బదిలీ చేశారు. వీరి స్థానంలో ప్రకాశం, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పలువురు ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇచ్చారు.

బదిలీపై వచ్చిన వారు..

జి.లక్ష్మీదేవి(ప్రకాశం) ఉయ్యూరు, ఎస్‌కే.మహబూబ్ సుభాని(గుంటూరు) పమిడిముక్కల, సి.చంద్రశేఖర్(గుంటూరు) మొవ్వ, ఐ.సత్యనారాయణ(గుంటూరు)తోటవల్లూరు, ఎస్.నాగలక్ష్మి(గుంటూరు) చల్లపల్లి, మారుతీ శేషమాంబ(గుంటూరు) ఘంటసాల, ఈ.మహేశ్వరరావు(తూర్పుగోదావరి) ఉంగుటూరు, ఎం.భారతి(తూర్పుగోదావరి) పామర్రు, కె.రత్నకుమారి(తూగోజిల్లా) బాపులపాడు, జీవీవీఎ.రామకృష్ణంరాజు(పగోజిల్లా) గూడూరు, కుంజా జ్యోతి(పగోజిల్లా) గుడివాడ, ఎంవీఆర్ కుమార్‌బాబు(తూగోజిల్లా) పెనమలూరు, కె.శివపార్వతి(గుంటూరు) వీరులపాడు, ఎ.శ్రీరమ్య(గుంటూరు) విజయవాడ రూరల్, ఎ.దీప్తి(గుంటూరు) చందర్లపాడు, పి.ఉమాదేవి(గుంటూరు) ఇబ్రహీంపట్నం, ఎన్.వెంకటేశ్వరరావు(గుంటూరు) కంచిక చర్ల, ఎ.శ్రీనివాసరావు(గుంటూరు) జి.కొండూరు, టీసీకేజే భరత్‌రాజ్(తూగోజిల్లా) వత్సవాయి, పి.శ్రీనివాస్(పగోజిల్లా) మైలవరం, ఎస్.ఆశీర్వాదం(పగోజిల్లా) రెడ్డిగూడెం,జి. విజయకుమారి(పగోజిల్లా) నుంచి విస్సన్నపేట, ఎం.విశ్వనాథ్(పగోజిల్లా) నందిగామ, డి.రాంబాబు(గుంటూరు) ఎ.కొండూరుకు బదిలీపై వచ్చారు.

5 నుంచి 20 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్

» మార్చి 1 నుంచి థియరీ పరీక్షలు

» 23కు వాయిదా పడిన ఎన్విరాన్‌మెంటల్

» 2న ఎథిక్స్ ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు గాను 93 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. 77 కేంద్రాలు ఎంపీసీ, బైపీసీ, 16 కేంద్రాలు ఒకేషనల్ విద్యార్థులకు ఎంపిక చేశారు. శుక్రవారం ఎథిక్స్ ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు జరగనున్నాయి. 3వ తేదీ జరగాల్సిన ఎన్విరాన్‌మెంట్ పరీక్షను 23వ తేదీకి వాయిదా వేశారు. జిల్లాలో మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న థియరీ పరీక్షలు 59 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి 21340 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 20161 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 131 కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షల ఏర్పాట్లపై మచిలీపట్నం ఆశీర్వాద భవన్‌లో ఆర్ఐవో రవికుమార్ చీఫ్ సూపరింటెండెంట్లు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కేశినేని నానికి మతి భ్రమించింది

» కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం : కేశినేని శ్రీనివాస్ (నాని)కి మతి భ్రమించిందని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యాఖ్యానించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుక్కకు ఉన్నపాటి విశ్వాసం నానికి లేదన్నారు. సైకోలందరు ఒక చోటకు చేరాయంటూ విమర్శించారు. అతను ఎంపీగా పోటీ చేస్తే మూడు లక్షల ఓట్ల తేడాతో ఓటమి పాలవుతాడని, అసలు జగన్ అతడికి టికెట్ ఇస్తాడో లేదో కూడా చెప్పలేమన్నారు. నాని ప్రజాజీవితం ఇంతటితో ముగుస్తుందని పేర్కొన్నారు. వైసీపీలో ఎవరూ తోడు దొరక్క అవినాశ్‌కి ముఖ్య అనుచరుడిగా ఉన్నాడన్నారు.

దళితులే దోషులా..!

(5వ పేజీ తరువాయి)

పోలీసులు చెబుతున్నారు. ఏ1గా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన ముగ్గిరాల చిరంజీవిని పెట్టారు. ఏ2గా అడప వెంకటరాజు (మహాత్మా గాంధీ నగర్, హైదరాబాద్), ఏ3గా అబ్దుల్ యహియ (హైదరాబాద్), ఏ4గా మహమ్మద్ జహీర్ (రాజేంద్రనగర్ మండలం, రంగారెడ్డి జిల్లా), ఏ5గా మహమ్మద్ జునైద్ (బహదూర్‌పుర, హైదరాబాద్)పై 326 సెక్షన్ నమోదు చేశారు. రంగబాబు చాలాకాలంగా వైసీపీలో ఉండి, ఈ మధ్యకాలంలో టీడీపీలో చేరి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీని, సీఎం వైఎస్ జగన్‌ను, కుటుంబ సభ్యులను అసభ్యంగా బూతులు తిట్టడం వల్ల దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు. కేసులో ఇన్నోవా కారును సీజ్ చేశామని, మరో ముద్దాయి ఆతీక్ పరారీలో ఉన్నాడని, స్కోడా కారును పట్టుకోవాల్సి ఉందని సీఐ ప్రసాద్ తెలిపారు.



వైభవంగా బాలయేసు పండుగ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 1 : పెరికీడు జ్యోతినగర్ చర్చిలో ప్రారంభమైన అద్భుత బాలయేసు పండుగ రెండో రోజు గురువారం సిల్వర్ జూబ్లీరిన్ గురువులు ఫాదర్ బొడ్డు ఆనంద్, విజయవాడ మెత్రాసనం ఫాదర్ దాని సురేష్ దివ్యబలిపూజ నిర్వహించారు. బైబిల్ వ్యాక్యాలను విశ్వాసులకు వినిపించారు. పెరికీడు, ఇందిరానగర్, అప్పనవీడు గ్రామ వీధుల్లో బాలయేసు ఊరేగించారు. ఈ కార్యక్రమంలో జెఎంజె సిస్టర్స్, ఉపదేశకులు పాల్గొన్నారు. పారిస్ కౌన్సిల్, మరియదళ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ధరలతో సామాన్యులు విలవిల

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, ఫిబ్రవరి 1 : ఆకాశానంటుతున్న నిత్యావసరాల ధరలు, పెంచిన విద్యుత్, బస్సు చార్జీలతో సామాన్యులు విలవిలాడుతుంటే ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులు పట్టనట్టు వ్యవహరించడం హేయమని, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పెనమలూరు ఇన్‌చార్జి బోడె ప్రసాద్ ఆరోపించారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక సాయిమహల్ సెంటర్, 3వ వార్డులో గురువారం పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బియ్యం, నూనె, ఇతర సరుకుల ధరలు నింగినంటుతుంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నకిలీ మద్యం అధిక ధరకు అమ్ముతూ, పేద వారి సంపాదనలో సగానికిపైగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దోచుకుంటున్నారని విమర్శించారు. ఉయ్యూరులో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి ఎప్పుడు ఇస్తారో తెలియక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, పార్టీ నాయకులు కూనపరెడ్డి వాసు, జంపన శ్రీనివాస్, జగరోతు నాగరాజు, అప్పలనాయుడు, అంజిబాబు, పైడయ్య, అర్జునరావు, జనసేన నాయకులు మేరుగ చినకోటయ్య, శివప్రసాద్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు మూడో వార్డులో టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కోలవెన్నులో బోడె సతీమణి హేమ ప్రచారం

ప్రజానాయకుడు బోడెను గెలిపించండి..

కోలవెన్ను (కంకిపాడు) : నిత్యం ప్రజలందరికీ అందుబాటులో ఉండే నాయకుడు బోడె ప్రసాద్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి హేమ అన్నారు. మండలంలోని కోలవెన్నులో గురువారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగానూ, బోడె ప్రసాద్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు తుమ్మల జగదీష్, పార్టీ నాయకులు ముల్పూరి కళ్యాణి, తట్టుకుర్తి సురేష్, ఇమ్మానియేలు, జగన్, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, షేక్ బాజి, కంచర్ల మోహన్, పాలగుడు సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు అయ్యప్ప, పూల వెంకట్, అన్నవరపు జాని, జగన్నాధం, రమేష్ పాల్గొన్నారు.



తాడిగడపలో దేవినేని గౌతమ్ స్మిత దంపతుల ప్రచారం

కాసరనేనివారి పాలెంలో..

కాసరనేనివారిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్‌రామ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు గొంది శ్రీనివాస ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నెక్కలపూడి బాబి, అరుణ్ ప్రసాద్, నర్రా సతీష్, ఆరేపల్లి సాంబశివరావు, పెద్ది గోపాలకృష్ణ, పెద్దు శ్రీనివాసరావు, పెద్దు వర ప్రసాద్, జడా జాను, ఇరుకులపాటి బాబు, కాసరనేని శివరామకృష్ణ, రెహమాన్, మునునూరి కృష్ణమోహన్, సుంకేసుల సాంబశివరావు, సుధాకర్, కిషోర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారు..

పెనమలూరు : సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ ఏనాడో సర్వం సిద్ధంగా ఉందని, సిద్ధం పేరుతో వైసీపీ నాటకాలను రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, టీడీపీ నేతలు దేవినేని గౌతమ్ స్మిత దంపతులు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, టీడీపీ తాడిగడప కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కానూరు, తాడిగడప, యనమలకుదురులలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో వారు పాల్గొని స్థానికులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వానికి తాకట్టు పెట్టిన సైకో జగన్‌రెడ్డి సిద్ధం పేరుతో మరో మోసానికి తెర తీశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఛాన్సు పేరుతో గతంలో రాష్ట్ర ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన విషయాన్ని అన్ని వర్గాల ప్రజలు గుర్తుంచుకొని జగన్‌రెడ్డిని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇక ఏమాత్రమూ భవిష్యత్తులో జగన్‌రెడ్డి చేతిలో మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని పేర్కొన్నారు.



కానూరులో జరిగిన కార్యక్రమంలో యార్లగడ్డ సుచిత్ర

టీడీపీ మహాశక్తితో మహిళలకు భరోసా..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మహాశక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళందరికీ టీడీపీ భరోసా కల్పిస్తోందని, రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి అన్నారు. బిళ్లనపల్లి టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి వడ్డిల్లి లక్ష్మి, మూల్పూరి సాయికళ్యాణి పర్యవేక్షణలో మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. బిళ్లనపల్లి మహిళా కమిటీ అధ్యక్షురాలిగా తాతా వెంకటేశ్వరమ్మ, కార్యదర్శిగా గోగినేని కమలకుమారిలతో పాటు 16 మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి టీడీపీ మేనిఫేస్టోలో ప్రకటించిన పథకాలను ప్రతి ఇంటికి వివరించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి, మన పిల్లల బంగారు భవిష్యత్తు కోసం టీడీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు ఆలూరి రామకృష్ణప్రసాద్, రాం బాబు, వెలివల వెంకటేశ్వరరావు, కాకుమాను గోపి, పానుగంటి రాట్నాలు, చన్నంశెట్టి దుర్గాదేవి, అంగడాల లక్ష్మి, తదితర మహిళలు పాల్గొన్నారు.



బిళ్లనపల్లి టీడీపీ మహిళ కమిటీతో సాయికల్యాణి



అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 1 : అప్పుల బాధ తాళలేక ఆరుగొలనులో చేపల చెరువు వద్ద పనిచేసే గూడూరు మండలం ముక్కొల్లుకు చెందిన పేరే ఆంజనేయులు (37) ఎలుకల మందు తిని గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై కనకరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తంగిరిశెట్టి రామకృష్ణ అనే రైతు చెరువు వద్ద కొంత కాలంగా ఆంజనేయులు పని చేస్తున్నాడు. ప్రైవేట్ ఫైనాన్స్ మీద ద్విచక్ర వాహనం తీసుకోగా అప్పును సకాలంలో చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వాళ్లు ఒత్తిడి చేస్తున్నారు. ఒత్తిడి తట్టుకోలేక మనస్థాపంతో చెరువువద్ద ఎలుకల మందు తిన్నాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆంజనేయులను కుటుంబ సభ్యులు గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్సై తెలిపారు.

జనసేన నున్న అధ్యక్షుడిగా యుగంధర్



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 1 : జనసేన విజయవాడ రూరల్ మండలం పరిధిలో గ్రామాల కమిటీలలో భాగంగా నున్న అధ్యక్షుడిగా మండా యుగంధర్ ను నియమించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహనీయుల విగ్రహాలకు జనసేన, టీడీపీ పార్టీల నేతలు గురువారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండా యుగంధర్, దండు సుబ్రహ్మణ్యంరాజు, గంపా శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ధనేకులలో పరిశ్రమలతో
భాగస్వామ్య సదస్సు రేపు

పెనమలూరు, ఫిబ్రవరి 1 : శాస్త్రసాంకేతిక రంగంలో శరవేగంగా పరివర్తనం చెందుతున్న అంశాల ప్రాతిపదికగా స్థానిక ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల మూడున పరిశ్రమలతో భాగస్వామ్య సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల తెలిపారు. సదస్సులో భాగంగా సమాచార, టెలీ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర విభాగాల్లో ప్రపంచ అత్యున్నతస్థాయి సంస్థలైన ఎడోబ్, ఎన్‌టీటీ డేటా, ఎక్సెల్ తదితర సంస్థలు పాల్గొంటున్నట్లు కళాశాల డైరెక్టర్ రవి ప్రసాద్ తెలిపారు. ఈ సదస్సులో కళాశాల బ్లాక్ చైన్, ఎనర్జీ, సమాచార, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు తెలిపారు.

మానవత్వం చాటుకున్న సీఐ

పెనమలూరు, ఫిబ్రవరి 1 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి ప్రథమ చికిత్స అందించి మానవత్వాన్ని చాటుకున్నారు పెనమలూరు సీఐ టీవీవీ రామారావు సేకరించిన వివరాల మేరకు.. భారీ గ్రానైట్ రాళ్లతో విజయవాడ వైపు నుంచి బందరు వైపు వెళుతున్న టిప్పర్ గురువారం సాయంత్రం గూడూరు మండలం తరకటూరు శివారులో జాతీయ రహదారిపై బోల్తా పడింది. అటువైపుగా తన వాహనంలో వస్తున్న పెనమలూరు సీఐ టీవీవీ రామారావు ప్రమాదాన్ని గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపి స్థానికుల సహాయంతో తీవ్రంగా గాయపడ్డ డ్రైవరును బయటకు తీసి అవసరమైన ప్రథమ చికిత్స అందించారు. అనంతరం చికిత్స నిమిత్తం అంబులెన్సుకు, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.



డ్రైవర్‌కు ప్రథమ చికిత్స అందిస్తున్న సీఐ రామారావు

పేదల సంక్షేమమే లయన్స్ క్లబ్ లక్ష్యం

పెనమలూరు, ఫిబ్రవరి 1 : సమాజంలో నిరుపేదల సంక్షేమమే లయన్స్ క్లబ్ ఏకైక లక్ష్యమని లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ జే ఫ్రాంక్ మూర్ పేర్కొన్నారు. గురువారం పోరంకి చిగురుపాటి మంజువాణి వరప్రసాద్ మల్టీ సర్వీస్ సెంటరులో జరిగిన 21వ జిల్లాస్థాయి సేవా మహోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ జేఎస్ శంకర్‌గుప్తా, మాజీ ఎమ్మెల్సీ లయన్ చిగురుపాటి వరప్రసాద్, వంకా రవీంద్రనాద్, నేత్రజ్యోతి దుర్గామల్లేశ్వరరావు, తేజ్‌రాజ్ సోలంకి, మద్దినేని చక్రధర్, కొల్లి రామకృష్ణ, చిన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కృత్రిమ అవయవాల కో-ఆర్డినేటర్ జే శ్రీరాం పవన్, పర్వతనేని సుభాష్‌బాబు, దామెర్ల శ్రీశాంతి, విజయ్‌కుమార్‌రాజు, మహాత్మాగోపాల్, గద్దె శేషగిరి, బెవర నాగేశ్వరరావు, వీవీపీఎస్ ఆంజనేయులు, హీల్ సంస్థ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోరంకిలో పంపిణీ చేస్తున్న సైకిళ్లు

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి : జాస్తి

గన్నవరం, ఫిబ్రవరి 1 : యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కేసరపల్లి కేవీసీసీ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. పోటీలను ప్రారంభించిన జాస్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసాని చేకూరిస్తాయన్నారు. క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండి రాణించాలన్నారు. అందరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఎలాంటి విభేదాలు లేకుండా విజయవంతంగా టోర్నమెంట్‌ను ముగించాలన్నారు. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక, పలగాని ఏసుబాబు, మండవ అన్వేష్, చీమలదండు రామకృష్ణ, షేక్ అబుల్యాజ్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న జాస్తి వెంకటేశ్వరరావు

టీడీపీలోకి పలువురు వైసీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 1 : టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు నాయకత్వాన్ని బలపరుస్తూ బాపులపాడులోని పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరుతున్నట్లు ప్రకటించారు. బుధవారం రాత్రి ఇక్కడ జరిగిన బీసీ సదస్సు వేదికపై మండల టీడీపీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీ మండల యూత్ ప్రెసిడెంట్ కర్రా ప్రసాద్‌పాల్, బాపులపాడు గ్రామ పంచాయతీ 2వ వార్డు సభ్యుడు కడవకొల్లు నాగరాజు, 12వ వార్డు సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, కడవకొల్లు రాజేష్, వైసీపీ విద్యార్థి, యువజన విభాగాల నాయకులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. ఈ నెల 4న గన్నవరంలో జరగనున్న యువదళం సభలో యార్లగడ్డ వెంకట్రావు చేతులు మీదుగా పార్టీ కండువాలు కప్పి సభ్యత్వం ఇవ్వనున్నట్లు దయాల రాజేశ్వరరావు తెలిపారు.

పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

గన్నవరం, ఫిబ్రవరి 1 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుడు గరికిపాటి శివశంకర్ అన్నారు. మండలంలోని దావాజీగూడెం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రం నూతన నిర్మాణానికి రూ.1.50 లక్షలు విలువ చేసే టైల్స్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయటమే జనసేన సిద్ధాంతమన్నారు. దివ్యాంగులకు పేదలకు, వృద్ధులకు సహకారం అందించటం పవన్‌కల్యాణ్ నినాదమన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఛైర్మన్ సంకాబత్తుల వెంకట్, కార్యదర్శి రజిత, జనసేన నాయకులు కోలవెన్ను నాని, బి.సంధ్య, కార్తిక్, రోషయ్య, బాబి, దుర్గారావు, సిరాజ్, బండి కిషోర్‌కుమార్, బావిశెట్టి ప్రదీప్ పాల్గొన్నారు.



స్పందన మానసిక వికాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న గరికిపాటి శివశంకర్

పెనమలూరు తహసీల్దార్‌గా పీఎన్‌డీ ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 1 : ఎన్నికల నేపథ్యంలో తహసీల్దారుల బదిలీలలో భాగంగా పెనమలూరు తహసీల్దార్‌గా పీఎన్‌డీ ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన పశ్చిమగోదావరి జిల్లా తణుకు తహసీల్దార్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వెంకట శివయ్యను ప్రభుత్వం ఏలూరు జిల్లాకు కేటాయించింది. త్వరలో పీఎన్‌డీ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

బాపులపాడు ఎంపీడీవో, తహసీల్దార్ బదిలీ

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు బదిలీ అయ్యారు. మండలస్థాయి అధికారుల బదిలీల్లో భాగంగా ఎంపీడీవోను తూర్పు గోదావరి జిల్లా బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న కె.రత్న కుమారిని ఇక్కడ నియమించారు. తహసీల్దార్ సునీల్‌బాబును బదిలీ చేశారు. ఆయన స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా చాగల్లులో పనిచేస్తున్న అంకం శ్రీనివాస్‌ను ఇక్కడకు బదిలీ చేశారు.

రూరల్ ఎంపీడీవోగా శ్రీరమ్య బాధ్యతల స్వీకరణ

గుణదల : విజయవాడ రూరల్ మండల ఎంపీడీవోగా అద్దంకి శ్రీరమ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల నిమిత్తం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అధికారుల బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం నుంచి అద్దంకి శ్రీరమ్యను విజయవాడ రూరల్ మండల ఎంపీడీవోగా బదిలీ చేయడంతో ఆమె గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న కుమారి భార్గవిని గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలానికి బదిలీ చేశారు.

ఎంపీడీవో విమాదేవికి వీడ్కోలు

ఉయ్యూరు : ఉయ్యూరు నుంచి బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో విమాదేవిని టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గురువారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఉయ్యూరు మండల పరిషత్ అధికారిణిగా పనిచేసి బదిలీపై గుంటూరు జిల్లాకు వెళ్తున్న విమాదేవిని ఆకునూరు, చినఓగిరాల, జబర్లపూడి, సాయిపురం సర్పంచ్‌లు గోలి వసంత కుమార్, యెనిగళ్ల శిరీష, సూరపనేని వరప్రసాద్, షేక్ జాన్‌బాషా, కాటూరు ఎంపీటీసీ సజ్జా అనూష, టీడీపీ మండల అధ్యక్షుడు కుటుంబరావు శాలువాతో సత్కరించారు.



ఎంపీడీవో విమాదేవిని సత్కరిస్తున్న టీడీపీ సర్పంచ్‌లు

కంకిపాడులో పోటాపోటీగా ఫ్లెక్సీలు

కంకిపాడు, ఫిబ్రవరి 1 : అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కంకిపాడులో ఫ్లెక్సీల వార్ నడుస్తోంది. బస్టాండ్ సెంటర్‌లో అధికార పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున సిద్ధం ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. బస్టాండ్ సెంటర్‌లో సొంత భవనాలపై బ్యానర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వం సంస్థ అయిన ఆర్టీసీ బస్టాండ్‌లో కూడా అధికార పార్టీకి చెందిన నాయకులు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. అదే విధంగా సెంటర్‌లో తెలుగు యువత ఆధ్వర్యంలో సంసిద్ధం అంటూ బ్యానర్‌ను ఏర్పాటు చేశారు.



ఆధ్యాత్మికంగా బలోపేతమే సమరసత లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 1 : హిందూ ధర్మ పరిరక్షణతో ప్రజలను ఆధ్యాత్మికంగా బలోపేతం చేస్తూ యువతకు సంస్కృతీ సంప్రదాయాలను తెలియజెప్పటమే సమరసత సేవా ఫౌండేషన్ లక్ష్యమని జిల్లా మహిళా కన్వీనర్ నాగరాజ కుమారి అన్నారు. వేలేరు అడ్డరోడ్డు వద్ద గల విఘ్నేశ్వర సహిత సీతా రామచంద్రస్వామి దేవస్థాన ఆవరణలో గురువారం నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ధర్మరక్షానిధి కరపత్రాలను, డైరీలను, క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిది మండలాలకు చెందిన 25మంది కన్వీనర్లతో పాటు ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు, నేరెళ్ల తులసీకృష్ణ, సీతారామాంజనేయులు, అర్చకులు హైగ్రీవాచార్యులు, గణేష్, తట్టి సుబ్బారావు, దావులూరి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ధర్మప్రచారక్‌లు



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

కొండాలమ్మ ఆలయంలో బాలబ్రహ్మానంద సరస్వతి ప్రవచనాలు

గుడ్లవల్లేరు: వేమవరంలోని కొండాలమ్మ దేవస్థానంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా దేవదాయ అధికారులు ఉత్తర్వుల మేరకు గురువారం నైమిశరణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. స్వామిని ఈవో సురేష్ బాబు ఆలయ మర్యాదలతో గౌరవించారు. అమ్మవారి శేష వస్త్రం, చిత్రప టాన్ని బహూకరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం గోపి, ధర్మ కర్తలు వెంకటస్వామి, కె.రవిశంకర్, బి.లీలాసౌజన్య, వెంకటనిర్మల తదితరులు సరస్వతిస్వామిని సత్కరించారు.



బాలబ్రహ్మానంద సరస్వతిని సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్తలు

వైసీపీ సలహాదారుల్లా ప్రభుత్వ సలహాదారులు

- ఏం ఒరగబెట్టారని వారిపై రూ.680 కోట్ల ఖర్చు?
- అందులో సజ్జలకే రూ.140 కోట్లు చెల్లింపా?
- ప్రభుత్వంపై బూరగడ్డ వేదవ్యాస్ ఆగ్రహం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1: వైసీపీ సలహాదారులుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ సలహాదారులకు ప్రభుత్వం రూ.680 కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్ర ప్రజలకు ఏం ఒరగబెట్టిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వేదవ్యాస్ మాట్లాడారు. ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డికే ప్రభుత్వం రూ.140 కోట్లు చెల్లించిందన్నారు. 89 మంది సలహాదారులను నియమించారని, వారికి ఏ అర్హతలు ఉన్నాయో తేటతెల్లం చేయాలని ఆయన నిలదీశారు. సలహాదారుల నియామకంపై హైకోర్టును ప్రభుత్వం తప్పుదోవ పట్టించిందన్నారు. ఎంతమంది సలహాదారులు ఉన్నారో ముఖ్యమంత్రికి తెలియదన్నారు. సలహాదారుడైన సజ్జల రామకృష్ణారెడ్డే మంత్రుల్లాగా ప్రెస్‌మీట్లు పెడుతూ ప్రతిపక్షాలపై విరుచుకుపడటం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. విద్యావిధానంలో మార్పు తీసుకువచ్చేటప్పుడు ఏ సలహాదారుడు సలహా తీసుకున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించకుండా ఐబీ సిలబస్‌ను ఎలా అమలు చేస్తారని ఆయన నిలదీశారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించలేని ఎమ్మెల్యే సింహాద్రి..వైసీపీ ఎంపీ అభ్యర్థా?

- జనసేన కోడూరు మండలాధ్యక్షుడు గంగయ్య

కోడూరు, ఫిబ్రవరి 1: అవనిగడ్డ నియోజకవర్గంలో స్థానిక సమస్యలు పరిష్కరించలేని ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబును మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా వైసీపీ ప్రకటించటం హాస్యాస్పదంగా ఉందని, నియోజకవర్గానికి చేస్తానని ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య విమర్శించారు. పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి, సముద్రపు కరకట్ట, కృష్ణానది కరకట్ట అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని ఇప్పటివరకు నెరవేర్చలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలందరూ గమనించి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించి నియోజకవర్గ అభివృద్ధి కృషి చేయాలని ఆయన పిలుపునిచాకచరు. దామోదరరావు, యర్రంశెట్టి దామోదరరావు, మేడా పిచ్చయ్య, స్థానిక నేతలు పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న ప్రముఖులు

మోపిదేవి, ఫిబ్రవరి 1: సుబ్రహ్మణ్యేశ్వరాలయాన్ని ఢిల్లీ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ దీప్‌పంత్, హరిహరరాత్‌లు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అధికారులు నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేద మంత్రాలతో వారికి ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఆర్ఐ సునీల్, వీఆర్వోలు మూర్తి, శ్రీనివాస్ ఉన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

- పంచాయతీ కార్యదర్శులతో డీఎల్పీవో జ్యోతిర్మయి

చల్లపల్లి, ఫిబ్రవరి 1: గ్రామ పంచాయతీల్లో పన్ను వసూళ్లు వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని మచిలీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారిణి(డీఎల్పీవో) ఐ.జ్యోతిర్మయి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామాల్లో తాగునీటి చెరువులను నీటితో నింపుకోవాలని సూచించారు. గ్రామాల్లో వీధి దీపాలు కలిగిన విద్యుత్ స్తంభాల వివరాలను ఏపీ పంచాయతీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలనా ఆదేశించారు. ఈవోపీఆర్డీ బి.అశోక్‌కుమార్, ఆయా మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

జగన్‌కు బీసీల పేరెత్తే అర్హత ఉందా?

- జయహో బీసీ సదస్సులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ



తోట్లవల్లూరు మండలం కుమ్మమూరులో జయహో బీసీ సభలో ప్రసంగిస్తున్న కొనకళ్ల నారాయణ, నందివాడలో మాట్లాడుతున్న బొడ్డు వేణుగోపాలరావు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 1: బీసీల పేరెత్తే అర్హత సీఎం జగన్‌కు లేదని, నా బీసీలంటూ అనడమే తప్ప, ఆ వర్గ ప్రజలకు ఆయన చేసింది శూన్యమని, బీసీలను ఆర్థికంగా ఎదగనీయకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి దగా చేశాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు విమర్శించారు. కుమ్మమూరులో గురువారం జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది టీడీపీ మాత్రమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేసేందుకు బీసీలంతా ఐక్యతతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. యాకమూరు నుంచి కుమ్మమూరు వరకు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా, టీడీపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి, వీరపనేని శివరామ్‌ప్రసాద్, రామినేని కుటుంబయ్య మూడే శివశంకర్, వీరంకి వరహాలరావు పాల్గొన్నారు.

బీసీలను దగా చేసింది ప్రభుత్వం

నందివాడ: బీసీలను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని, బీసీల సంక్షేమం కోసం పెట్టిన 34 పథకాలను రద్దు చేసిందని బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలోనే బీసీలకు మేలు జరిగిందన్నారు. కోదండ రామయ్య మిల్లు ఆవరణలో గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బొడ్డు వేణుగోపాలరావు, అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ చైర్మన్ లంకే నారాయణప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ అధికారి బచ్చుల సుబ్రహ్మణ్యం(బోసు) విచ్చేశారు. బీసీలపై వైసీపీ ప్రభుత్వం దాడులు చేస్తోందని, ఎదిరిస్తే కేసులు పెట్టి చిత్రహింసలు పెడుతోందని, రాష్ట్రంలో దాడుల్లో గుడివాడ మూడో స్థానంలో ఉందని బచ్చుల సుబ్రహ్మణ్యం ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలంతా ఏకమై టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించి బూతుల నానీని ఇంటికి పంపాలన్నారు. రాధాకృష్ణ, రాకేష్, వేణు, నాగరాజు, లక్ష్మణరావు, మజ్జాడ నాగరాజు, ప్రభాకర్, ఏడుకొండలు, చాట్రగడ్డ రవి, కరుణాకరావు, వెంకటరంగారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొడాలి నానీని ప్రజలు చీదరించుకుంటున్నారు

- వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఘోర ఓటమి: వెనిగండ్ల



బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీలో వృద్ధురాలితో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము

గుడివాడ: ఇరవై ఏళ్లుగా ప్రజాసమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధిని మరచిన ఎమ్మెల్యే కొడాలి నానీని ప్రజలు చీదరించుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో నానీకి ఘోర ఓటమి తప్పదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము హెచ్చరించారు. గురువారం గుడ్లవల్లేరు మండలం రెడ్డిపాలెం నుంచి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నక్కవారిపాలెం, గాదేపూడి, ఉలవపూడి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. జనసేన, టీడీపీ నేతలు బూరగడ్డ శ్రీకాంత్, శాయన పుష్పావతి, కొనరాజు బాపయ్యచౌదరి, తూము పద్మజ, తోట చిన్నారి, తెల్లాకుల నాగలక్ష్మి, నిమ్మగడ్డ శశికళ, జంగం మోహనరావు, పెన్నేరు రమేష్‌బాబు, బెల్లంకొండ ఏడుకొండలు, భాస్కరరావు, కిషోర్, సాయిబాబా, సర్వేశ్వరరరావు, మల్లికార్జునరావు, పోతురాజు, రాము, అజిత్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, లక్ష్మణ్, రామలింగయ్య, చందు, పేర్ని జగన్, శేషవేణి పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో టీడీపీ సీనియర్ నేత తాతినేని శివరామబ్రహ్మం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వర్ల కుమార్ రాజా

శివరామబ్రహ్మం సేవలు నిరుపమానం

పమిడిముక్కల, ఫిబ్రవరి 1: కపిలేశ్వరపురం గ్రామానికి, పార్టీకి టీడీపీ సీనియర్ నాయకుడు తాతినేని శివరామ బ్రహ్మం నిరుపమాన సేవలు అందించారని పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా అన్నారు. గురువారం గ్రామంలో నిర్వహించిన శివరామబ్రహ్మం సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. శివరామబ్రహ్మం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఇతోధికంగా సాయం అందించారని అన్నారు. పార్టీ నాయకులు పెదబాబు, చలసాని రమేశ్, వెంకట నారాయణ, కె.శ్రీనివాసరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, బుల్లెట్ బాబి తదితరులు శివ రామబ్రహ్మం చిత్రపటానికి నివాళులర్పించారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన

గుడివాడ: పెదఎరుకపాడు, మందపాడులలో గురువారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎంల) పనితీరుపై అవగాహన సదస్సును నిర్వహించారు. టూటౌన్ సీఐ దుర్గారావు మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఓటింగ్ యంత్రాల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పి చెరుకు ట్రాక్టర్ పల్టీ

చల్లపల్లి, ఫిబ్రవరి 1: చల్లపల్లిలోని నడకుదురు రోడ్డులో చెరకు ట్రాక్టర్ పల్టీ కొట్టింది. గురువారం నడకుదురు వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ రోడ్డుపై అదుపు తప్పి ట్రక్కు పక్కకు బోదెలోకి ఒరిగిపోయింది. నడకుదురు నుంచి చల్లపల్లి మండలం లక్ష్మీపురంలోని కేసీపీ షుగర్స్ చెరకు ఫ్యాక్టరీ డంపింగ్ యార్డుకు చెరకు తరలిస్తుండగా ట్రాక్టర్ ప్రమాదానికి గురైంది. రోడ్డు అధ్వానంగా ఎత్తు పల్లాలుగా ఉండటంతో కుడివైపుగా వెళ్లే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో అదుపు తప్పి, ట్రక్కు పల్టీ కొట్టడంతో లోడు పడిపోయింది. చల్లపల్లి - నడకుదురు రహదారిపై చల్లపల్లి వద్ద అత్యంత భారీ ప్రమాదకర గోతుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని గోతులు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

వాసవీ క్లబ్ విదర్భపురి కార్యవర్గ ప్రమాణస్వీకారం

గుడివాడ: కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వాసవీక్లబ్ విదర్భపురి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం గురువారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు మామిడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తాత రజినీకుమారి సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ విద్యానిధికి ఉపయోగించేందుకు 26 మంది వాసవీక్లబ్ వనిత సభ్యులను తీసుకున్నారు. గోశాలకు గోవులను, అంధుల ఆశ్రమానికి నెలవారి సరుకులు, కన్యకాపరమేశ్వరి ఆలయానికి 6 కుర్చీలు, పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. పేద ఆర్యవైశ్య విద్యార్థినికి రూ.వెయ్యి అందించారు. ముగ్గులపోటీల్లో గెలిచిన వారికి బహుమతులందించారు.

క్రీడాకారిణులకు అభినందన

చల్లపల్లి, ఫిబ్రవరి 1: గురుకుల బాలికలు క్రీడల్లో రాణించటం అభినందనీయమని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. చల్లపల్లి ప్రభుత్వ ఎస్సీ బాలికల జట్టు క్రీడాకారిణులు ఆడుదాం ఆంధ్రా అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి ఖో-ఖో పోటీల్లో మూడో స్థానం సాధించారు. గురువారం చల్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద విద్యార్థినులను సర్పంచ్ సత్కరించారు. పంచాయతీ ఈవో పి.మాధవేంద్రరావు, ప్రిన్సిపాల్ పి.అరుణకుమారి, పీఈటీ దేవీ పద్మజ, శానిటరీ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై సర్వే

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో తెలుసుకోవటానికి కల్వపూడి అగ్రహారంలో సర్వే నిర్వహిస్తున్నట్లు ముస్సోరి ఫ్యాకల్టీస్ ఐఏఎస్ సుభ్రవాన్స్ త్రిపాఠి అన్నారు. గురువారం కల్వపూడి అగ్రహారంలో సమిత్వ సర్వే కోసం కల్వపూడి అగ్రహారం గ్రామ ప్రజలతో కలిసి వీధివీధి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాల వివరాలను త్రిపాఠి అడిగి తెలుసుకున్నారు. డీపీవో నాగేశ్వరరావు నాయక్, సర్పంచ్ పి.వెంకటేశ్వరమ్మ, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి హరికృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.



కల్వపూడి అగ్రహారంలో గ్రామ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సుభ్రవాన్స్ త్రిపాఠి

ఆర్థిక సాయం అందజేత

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1: బందరు మండలం పెదపట్నంలో క్రీడా ప్రాంగణం అభివృద్ధికి, శిథిలమైన చర్చి గోడ పునర్నిర్మాణానికి, దివ్యాంగులకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆర్థిక సాయం అందించారు. ఇద్దరు దివ్యాంగులకు రూ.10వేలు అందించారు. జనసేన, టీడీపీ నాయకులు గడ్డం రాజు, మందపాటి అజయ్, మహమ్మద్ సమీర్, కూనపరెడ్డి ప్రసాద్, మోకా రవి పాల్గొన్నారు.



పెదపట్నంలో దివ్యాంగుడికి నగదు అందజేస్తున్న బండి రామకృష్ణ

5న మంటాడలో హుండీ లెక్కింపు

పమిడిముక్కల, ఫిబ్రవరి 1: మంటాడలో అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీలను ఈనెల 5న ఉదయం 10 గంటలకు దేవదాయ అధికారుల సమక్షంలో తెరిచి లెక్కించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆర్.మాధవీలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల భక్తులు లెక్కింపు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమాల్లో అన్నదానం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1: పామర్తి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు పామర్తి రాజా ఆధ్వర్యంలో గురువారం పలు వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిలకలపూడి అన్నపూర్ణ, గణపతి సచ్చిదానంద, ఆర్సీఎం, వాసవీ, కాశీ అన్నపూర్ణ వృద్ధాశ్రమాలలో వృద్ధులకు అన్నదానం చేశారు. బాలం జితేంద్ర పాల్గొన్నారు. దివంగత పామర్తి వెంకటస్వామి నగరానికి చేసిన సేవలను పలువురు వివరించారు.



చిలకలపూడి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న పామర్తి రాజా

బీజేపీ పార్లమెంట్ కార్యాలయం ప్రారంభం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1: బుట్టాయిపేటలో గురువారం బీజేపీ మచిలీపట్నం పార్లమెంట్ కార్యాలయాన్ని వర్చువల్ విధానంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ప్రారంభించారు. పార్టీ మచిలీపట్నం పార్లమెంటు అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి ఉప్పలాటి శ్రీనివాసరాజు, జిల్లా ఇన్‌చార్జి వి.కపర్ధి, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై వినతి

పెడన, ఫిబ్రవరి 1: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ నాయకులకు చేనేత కార్మికుల ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ నాయకులు మెమోరాండం ఇచ్చారు. విజయవాడ ఆంధ్ర రత్న భవన్‌లో పల్లంరాజు, జేడీ శీలం, కొప్పుల రాజును వారు గురువారం కలసి చేనేత సమస్యలపై మెమోరాండం ఇచ్చారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఏం చేయాలో సూచించారు. తమ ఫెడరేషన్ ప్రతిపాదనలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చాలని వారు కోరారు. మెమోరాండం సమర్పించిన వారిలో ఫెడరేషన్ నాయకులు బండారు ఆనంద ప్రసాద్, యినమల శివరామ ప్రసాద్, పిల్లలమర్రి నాగేశ్వరరావు, వాసా పల్లపురాజు తదితరులు ఉన్నారు.

నందిగం సర్పంచ్ ఎన్నికపై హైకోర్టు స్టే

పెడన రూరల్: జిల్లా సివిల్ కోర్టు ఉత్తర్వులతో ఇటీవల నందిగం సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేసిన బొడ్డు హరిబాబు ఎన్నికను నిలిపివేయాలంటూ సర్పంచ్‌గా ఎన్నికైన బొడ్డు చినబాబు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు స్టేఆర్డర్ ఇచ్చిందని హరిబాబు ప్రమాణం చేసినా చెల్లదని చినబాబు తెలిపారు. ఈనెల8న విచారణ చేస్తామని కోర్టు పేర్కొందని ఎండీవో వి.రెడ్డయ్య తెలిపారు.

నగరాభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం

- మచిలీపట్నం నగరపాలకసంస్థ ఉద్యోగులకు కమిషనర్ బాపిరాజు పిలుపు



కలెక్టర్ రాజాబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మచిలీపట్నం నూతన కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1: నగరాభివృద్ధికి సమష్టిగా పనిచేద్దామని మచిలీపట్నం నగరపాలకసంస్థ ఉద్యోగులకు నూతన కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్ నుంచి మచిలీపట్నానికి బాపిరాజు బదిలీపై వచ్చారు. నగరపాలక సంస్థలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజాబాబును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

నాగాయలంక తహసీల్దార్‌గా సుందరరాజు

నాగాయలంక: నాగాయలంక తహసీల్దార్‌గా పని చేస్తున్న జె.విమలకుమారి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం తహసీల్దార్ ఎం.సుందరరాజు ఇక్కడకు బదిలీపై వచ్చారు. విమలకుమారికి కార్యాలయ ఉద్యోగులు గురువారం వీడ్కోలు పలికారు.

మొవ్వ ఎండీవోగా చంద్రశేఖరరావు

కూచిపూడి: గుంటూరు జిల్లా భట్టిప్రోలు నుంచి బదిలీపై వచ్చిన చంద్రశేఖరరావు మొవ్వ ఎండీవోగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎండీవోగా విధులు నిర్వహించిన సుధాప్రవీణ్ పశ్చిమగోదావరిజిల్లాకు బదిలీ అయ్యారు.

మొవ్వ తహసీల్దార్ తూర్పుగోదావరి జిల్లాకు

కూచిపూడి: మొవ్వ తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు.

పామర్రు ఎంపీడీవోగా భారతి

పామర్రు: పామర్రు ఎంపీడీవోగా ఎం.భారతి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పామర్రు ఎంపీడీవో వై.రామకృష్ణ పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు బదిలీ అయ్యారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నుంచి ఎంపీడీవో భారతి ఇక్కడకు బదిలీపై వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

చల్లపల్లి ఎంపీడీవోగా నాగలక్ష్మి

చల్లపల్లి: చల్లపల్లి ఎంపీడీవోగా ఎస్.నాగలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా నిజాంపట్నం నుంచి ఆమె బదిలీపై వచ్చారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పీవీ మాధవేంద్రరావు, పంచాయతీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

తహసీల్దార్ గోపాలకృష్ణకు సన్మానం

చల్లపల్లి: చల్లపల్లి నుంచి బదిలీపై వెళుతున్న తహసీల్దార్ కె.గోపాలకృష్ణను తహసీల్దార్ కార్యాలయ అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

తోట్లవల్లూరు ఎంపీడీవోగా సత్యనారాయణ

తోట్లవల్లూరు: గుంటూరుజిల్లా కొల్లూరు మండలం నుంచి బదిలీపై వచ్చిన ఐ.సత్యనారాయణ గురువారం తోట్లవల్లూరు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన టి.స్వర్ణలత పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈవోపీఆర్డీ నవరత్నం, పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

పెడన తహసీల్దార్‌కు వీడ్కోలు

పెడన: పెడన తహసీల్దార్ పి. మధుసూదనరావు పాలకొల్లు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆయనకు రెవెన్యూ ఉద్యోగులు గురువారం సాయంత్రం తోటమూల ఫంక్షన్ హాలులో వీడ్కోలు పలికి సత్కరించారు.

గుడివాడ రూరల్ ఎంపీడీవోగా కుంజా జ్యోతి

గుడివాడ రూరల్: గుడివాడ రూరల్ ఎంపీడీవోగా కుంజా జ్యోతి ఎంపీడీవో కార్యాలయంలో బాధ్య తలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం నుంచి ఎన్నికల విధుల్లో భాగంగా గుడివాడ వచ్చారు.

చేపల చెరువుల నిర్వహణకు వేలం

పెడన, ఫిబ్రవరి 1: మునిసిపాలిటీకి చెందిన నాలుగు చెరువుల్లో చేపలు వేసి పెంచుకుని పట్టుకునే హక్కుకు ఈనెల 12వ తేదీ ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని కమిషనర్ బి.మహేంద్ర తెలిపారు. కొత్త చెరువు, తామర చెరువు, కొలుకుల వారి చెరువు, మల్లి చెరువులకు వేలం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు పాటకు ముందు సాల్వెన్సీలు ఇవ్వడంతో పాటు డిపాజిట్లు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు మునిసిపల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు. చెరువుల వేలం ముగిసిన అనంతరం మహిళా వాణిజ్య సముదాయం, మహాత్మాగాంధీ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్, బంటుమిల్లి రోడ్డు మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్, పాత కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న ఏడు షాపులను లీజుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.

ఎస్వీహెచ్‌లో సాఫ్ట్‌స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1: ఎస్వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. 35 మంది విద్యార్థులకు సాఫ్ట్‌వేర్, లైవ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్ నాగరాజును సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ బి. నాగజ్యోతి, ప్రొఫెసర్ రవికుమార్ పాల్గొన్నారు.